కథానిక

# స్నేహలత

మారేమండ రామారావు

శేషమ్మ స్నేహం చిట్టెమ్మకు చివరకు విషతుల్యమైంది. నిజంగా, తనకు శేషమ్మ, తనామెకూ చేదోడు వాదోడౌతామని చేసుకున్న నిర్ణయాలు ఇప్పటిదాకా సవ్యంగానే జరిగాయి. కాని చిట్టెమ్మ తన కొడుకు చదువుకోసం శేషమ్మకు అప్పు తీర్చమని నిలేసింది. ఈ ఘట్టం వాళ్ల స్నేహానికి అంతరాయం కలిగించి, వాళ్లమధ్య ద్వేషాల్ని రెచ్చగొట్టిందని చెప్పొచ్చు.

అడిగిన తక్షణం, చిట్టెమ్మకుకాని, ఆమె ఆర్డరు పొందిన మరి ఏ ఇతరులకుగాని ఇచ్చేట్లుగా ప్రోనోటు వ్రాసి ఆరువందల రూపాయలు తన కూతురు పెళ్లికి అప్పుగా పుచ్చుకుంది శేషమ్మ. ఆసొమ్ము ఇచ్చేప్పుడు చిట్టెమ్మ వెనుదీయలేదు. వాళ్ళ స్నేహం ముందు ప్రోనోట్లు చాలా అనవసరంగా కనిపించాయి. తల్లి వడిగి ఆరువందలూ ఇచ్చేసింది. పెళ్ళయ్యాక తీరుబడిగా శేషమ్మ ప్రోనోటు వ్రాసి ఇచ్చింది. 'మాటలు చాలవూ? ఎందుకివీ?' అంది చిట్టెమ్మ.

వాళ్ల స్నేహానుబంధం చాలా గట్టిది. మొదట శేషమ్మ ఇంటికి చిట్టెమ్మ కుటుంబంతో అద్దెకు వచ్చి అక్కడ ఉండడం, తర్వాత చనువుగా ఒకరితో ఒకళ్లు పరిచయం ఏర్పరచుకోవడం వాళ్ళ స్నేహాలతను మొలకెత్తించి, వృద్ధిచెందించి, ఒకరితో ఒకరికి సన్నిహితత్వం కలుగచేసింది. సామాన్యంగా దినచర్యలు తప్పిస్తే మిగతా సమయమంతా ఒకళ్ళ దగ్గర ఒకళ్లు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ గడిపేవారు. రోజూ యిది వాళ్లకు అలవాటైపోయింది. ఈ విధంగా కొన్నిరోజులు జరిగాక. రోజులు బాగుపడి చిట్టెమ్మ, వాళ్లూ అక్కడనుంచీ మూడు మైళ్ళ దూరంలో ఒక చక్కటి ఇల్లు కొనుక్కొని వెళ్లిపోయారు. ఆ ఇంట్లో దంపి గృహప్రవేశం జరిగాక శేషమ్మ తన యింటికి వచ్చేసింది. తర్వాత ప్రతిరోజూ, శేషమ్మ అక్కడకో, చిట్టెమ్మ యిక్కడికో వెళ్లి ఒకర్నొకరు చూసిరావల్సిందే! అప్పుడప్పుడు ఒకళ్ల యింట్లో ఇంకొకళ్ళు రెండుమూడు రోజులపాటు ఉండిపోతుండేవారు. వాళ్ల స్నేహం చాలామందికి ఉదాహరణగా తయారైంది.

ఇలాటి స్నేహం ఇప్పుడు విచ్ఛిన్నం కావలసి వచ్చింది. చాలాసార్లు మాటల సందర్భంలో బాకీసంగతి చిట్టెమ్మ అడిగినా శేషమ్మ ఏదో సాకుచెప్పి తప్పించుకునేది. మొహమాటం వల్లా, వాళ్ల స్నేహంవల్లా చిట్టెమ్మ కచ్చితంగా అడగలేకపోయేది.

ఇప్పుడు కొడుకు చదువు ముఖ్యం కావడం మూలాన చిట్టెమ్మకు ఆమెను కచ్చితంగా అడగడం తప్పిందికాదు. స్కూల్లో చేర్చే వేళకైనా తప్పక యివ్వమని బాగా ఒత్తిడి చెయ్యగా, ఇస్తానని మాట ఇచ్చింది శేషమ్మ.

కాని తీరా ఆసమయానికి శేషమ్మ తన ఊరు వెళ్లిపోయింది. ఇక స్కూల్లో 15 రోజులకు తీస్తారన్నదాకా చూసి, తల్లినీ, కొడుకునూ వాళ్ళ ఊరు పంపింది చిట్టెమ్మ. వాళ్లు అక్కడకు వెళ్లి అడగ్గా, చాలా మర్యాదచేసి, ఉన్నన్నాళ్లు అవీ, ఇవీ చేసిపెట్టి చివరకు పాతిక రూపాయలు ఇచ్చి పంపింది. తన పరిస్థితి చాలా అన్యాయంగా ఉన్నదనీ, తప్పక అందుతుందనుకున్న సొమ్ము సమయానికి అందలేదనీ, ఏవేవో సాకులు చెప్పి పంపింది. జరిగిన మర్యాదల ముందు బాకీ మాట మరచిపోయి శేషమ్మ బహుమతిగా యిచ్చిన అరటికాయలు, పనసపళ్లూ, కొబ్బరికాయలూ పారితోషికంగా తీసుకుని యింటికి వచ్చారు వాళ్లు.

ఏమైతేనేం, చిట్టెమ్మకు శేషమ్మ సమయానికి సొమ్ము యివ్వలేకపోయింది. చిట్టెమ్మకు ఒళ్లు మండిపోయింది. ఆస్నేహం, నమ్మకా,

ప్రాధేయం, అవన్నీ సమయానికి కావలసిన సొమ్ముకోసం చూసినవని తను గ్రహించలేక పోయింది. తన అవసరంమాత్రం అలాంటిది కాదూ? ఇప్పుడు డబ్బుకోసం తను ఒకళ్ల కాళ్లు పట్టుకోవలసిందేగా?

అప్పో, సప్పో చేసి కొడుకును స్కూల్లో చేర్పించింది శేషమ్మ. మానుతుందా మరి! అయితే శేషమ్మంటే చిట్టెమ్మకు ఒక ఏహ్యభావం ఏర్పడ్డది. ఆ తియ్యటి కబుర్లలో, చల్లటి స్నేహంలో, కమ్మటి మర్యాదలో ఇంత మోసం, స్వార్థం ఇమిడి ఉందని గ్రహించ లేకపోయింది. పాడు మనసు, ఎటు తిప్పితే అటు తిరుగుతుందిగా!

తర్వాత శేషమ్మ వచ్చింది. చిట్టెమ్మ ఏమీ ఉంచుకోలేదు. దులిపి దుళ్లగొట్టింది. మొహంమీద నానామాటలూ అడింది. తన ఉక్రోషం అంతా భాషారూపంలో వెలువరించింది. శేషమ్మ మాత్రం చలించలేదు.

'అదనుకు పట్టుకవెళ్లినదానవు, ఏపొలమైనా, ఇల్లయినా తాకట్టుపెట్టయినా, అమ్మి అయినా ఇచ్చి నా మాటమర్యాదా, పరువూ నిలబెట్టావు కావు.' అన్నది చిట్టెమ్మ.

'అలా చెయ్యదలచుకున్న పక్షంలో నా కూతురు పెళ్లే అలా జరిపించుదును, ఆ కొంపా, గోడూ నిలబెట్టుకోడానికే ఈ ఏడుపంతా' అన్నది శేషమ్మ.

చిట్టెమ్మకు పట్టరాని కోపంవచ్చింది. దాని ఫలితంగా ఇద్దరూ మాటామాటా అనుకున్నారు.

'ఇప్పుడైనా సవ్యంగా బాకీ తీరుస్తావా?' అనడిగింది చిట్టెమ్మ. శేషమ్మ ఏమీ తీసిపోయిందికాదు, 'నా యిష్టం వచ్చినప్పుడూ, వీలైనప్పుడూ తీరుస్తాను, తీర్చగలిగినంత. కాకపోతే, నీయిష్టం ఏంచేసుకుంటావో?' అంది.

చిట్టెమ్మ నిర్ఘాంత పోయింది. శేషమ్మ మాటలవల్లనైనా లొంగుతుందని అనుకుంది కాని నిష్ఫలమైంది.

ఏ పరిస్థితుల్లోనూ శేషమ్మ లొంగి బాకీ తీర్చే పరిస్థితుల్లో ఉన్నట్లు కనబడక పోవడం వల్ల చిట్టెమ్మ దావావేద్దామని నిశ్చయించుకుంది. దావా వేశాక, ఒకవేళ తను గెలిచి, బాకీ వసూలైతే, ఆ సొమ్ము కాస్తా ప్లీడర్లకూ, గుమస్తాలకు, ఫీజులకూ ఈలోపున అయే ఖర్చులకూ కటాకటిగా సరిపోవచ్చు. ఆకాడికి తను దావా వెయ్యడం అనవసరంగానే తోచిందామెకు! అయితేనేం, ఓ సారి ఆటాడించి దానికి గౌరవ ప్రతిష్ఠలు లేకుండా చేసి నలుగురిలో తలవంపులు చేస్తే చాలదూ? అప్పటికి తన అక్కసు తీరుతుంది.

సందిగ్ధావస్థలో పడిపోయింది చిట్టెమ్మ.

చివరకు నలుగురి సలహాలూ పాటించి ఆచారులు కమ్మేసింది ఆ ప్రోనోటు. ఆచారులు ఇలాంటి విషయాలలో దిట్ట. అందెవేసినవాడు. చిట్టెమ్మ 'పోయింది పొల్లు, ఉన్నది గట్టి' అన్న మాట ప్రకారం ఆనోటును ఐదు వందల రూపాయల కమ్మేసింది. వంద రూపాయల నష్టంతోనైనా సొమ్ము కళ్ళబడ్డదన్న సంతోషంతో నిలుచున్నపాటున సొమ్ము తీసుకుని నోటు ఇచ్చేసింది.

'చూడండి, చిట్టెమ్మగారూ! మూడురోజుల్లో దాన్ని మూడు చెరువులనీళ్లు తాగించనూ? హా! నేను చిట్టెమ్మగారు కాదు, ఆచారి! వీడి తడాఖా దానికింకా తెలియదు. రక్తం ఓడ్పిస్తానండీ' అని ప్రోనోటు పట్టుకెళ్ళాడు.

ఆచారి కరకు. వాడి కిలాంటి వ్యవహారాలు మునివ్రేళ్ళమీద నడుస్తాయి. అలాంటి ఆచారి శేషమ్మ ధాటీకి తట్టుకోలేక పోయాడు. అన్ని విధాలా ప్రయత్నించినా ఫలం శూన్యమైంది.

ఆఖరికి చలపతికి ఆనోటు ఐదువందల యాభై కమ్మేశాడు ఆచారి. ఆచారి ఐదువందలకే కొన్న నోటును చలపతి హెచ్చు ధరకు కొనడం వింతగానే కనబడవచ్చు. కాని చలపతిగాడికి తనా బాకీ వసూలు చెయ్యగలననే ఆత్మవిశ్వాసం ఉండడంచేత వాడా పని చేసాడు.

ఈ వార్తలు చిట్టెమ్మకు ఎప్పటి వప్పుడు చేరుతూనే ఉన్నాయి.

'చూశావే అమ్మా! ఆఖరికి ఆచారులుకూడా అమ్మేశాట్ట! మనం వదిలించుకోడం ఎంత మంచిదైందో! వాడే చాలలేకపోతే మన మెక్కడ? ఎంత అవస్థలు పడుదుమో?' అంది.

చలపతి ఊరుకునే రకం కాదు. ప్రయత్నాలన్నీ చేస్తూన్నాడు. చిట్టెమ్మ నోటు అమ్మినట్టు తెలియగానే శేషమ్మ ఊరంతా ఉపన్యాసాలివ్వడం మొదలుపెట్టింది. నోరు కడుక్కొని

తిట్టింది చిట్టెమ్మను. తాను అదనంగా వంద రూపాయలు తీర్చగా అది నోటులో వ్రాయలేదనీ, తనువాళ్ళ కిచ్చిన పనసకాయ్లూ గ్లాసోక్ల డబ్బాలూ అవన్నీ లెక్క వెయ్యలేదనీ, ఇంకా ఏవేవో ఆడిపోసింది.

ఇవన్నీ విన్న చిట్టమ్మ, 'పోనిద్దూ! మనం తింటేగా భయం, ఆ గయ్యాళి నోటికి హద్దూ పద్దూ ఉంటేగా' అనుకున్నది.

చలపతిగారు ముందుగానే రిజిష్టరు నోటీసిచ్చాడు. ఇచ్చిన మూడో నాడే పోలీసు బందోబస్తుతో వచ్చి ఇనప్పెట్టె జప్తుచేశాడు. బండికి వేసి తోలించాడు. శేషమ్మ జుట్టు విరబోసుకుంది. బండీ వెనకాల రాగాలతో బయల్దేరింది. దొంగలని కేకలు వేసింది. నోటికివచ్చినంతవరకూ కేకలువేసి, అపశ్రుతులు పలికింది. ప్రజలతో మొరపెట్టింది. ఫలితం శూన్యమైంది. చలపతి ఇంటికి బండీ చేరాక పోలీసులు ఆమెను వెనక్కు పంపేశారు. చేసేదిలేక శేషమ్మ ఇల్లు చేరుకుంది.

ఆ ఇనప్పెట్టె విలువ ఆరువందలని అంచనా వేసి ప్రభుత్వం దాన్ని చలపతికే వదిలేసింది. చలపతి వేలం వేయగా దానిమీద రెండు వందలు అదనంగా లాభం పొందాడు.

ఇప్పటికీ శేషమ్మా, చిట్టెమ్మా ఒకళ్ళని గూర్చి ఒకళ్లు కలపొయ్యారు. ఒకళ్ళుపిలిచిన ఒకళ్లు వెళ్ళరు ఒకళ్ళపొడ మరొకళ్ళకి గిట్టదు. నిజానికి నోటీసులు ఇవ్వడం, జప్తుచెయ్యటం, భయపెట్టడం చేసినది ఆచారీ, చలపతీనూ. మంచిగా, నెమ్మదిగానే అడిగింది చిట్టెమ్మ-అయినా తెగిన వాళ్ల స్నేహం, ఇద్దరి మనస్సుల మధ్యా మంట లేసింది



పాకిస్తాన్ ప్రధాని మిస్టర్ లియాకత్ ఆలీఖాన్ వాషింగ్టను వచ్చినప్పుడు, ఆయనను, ఆయనసతికి ప్రెసిడెంట్ ట్రూమన్ దంపతులు స్వాగతమిచ్చినప్పటి చిత్రం. బేగమ్ లియాకత్ ఆలీఖాన్, ట్రూమన్ సతి, అమెరికాలోని పాకిస్తాన్ రాయబారి ఇస్పహానీ సతి, శ్రీమతి విజయలక్ష్మి పండిట్ లను ఈ చిత్రంలో చూడవచ్చు.